# ఈ వివాహాన్ని సమర్పిస్తున్న వారు

వధూవరులకు సరిజోడి కుదిరింది, స్వర్గంలో దేవతలచే వివాహం జరిగిపోతుందనీ, అదంతా ఎప్పుడో ఫిక్స్ అయిపోయింది, ఏమిటో మనం పాట్లు పడక తప్పదనీ అమ్మాయి పెళ్లిచేసేవాళ్లు అనుకుంటూ వుంటారు. చివరకు పెళ్లి అయ్యేటప్పటికి కన్యాదాతకు స్వర్గం, అంతే స్థాయిలో, ఊబిలో పడ్డ మనిషిలా అప్పుల నరకంలో దిగబడిపోయి, స్వర్గానికి చేరువ అవుతాడు అమ్మాయి తండ్రి.

మా మూర్తికి ఒక్కతే కూతురు. బాగా చదివించేడు. కాని పెళ్లి అనేటప్పటికి మా అమ్మాయి ఎంతో చదువుకుంది కట్నం ప్రసక్తే లేదంటూ వుంటాడు. మూర్తి ఎన్నోసార్లు నా దగ్గరకు వచ్చి, తన కూతురి మేచ్ ఫిక్సింగ్ అదే పెళ్లి సంబంధాల విషయంలో పడుతున్న పాట్లు ఏకరువు పెట్టేవాడు.

ఉదయమే పేపర్ చూస్తున్నాను. హెడ్‌లైన్స్‌లో ముఖ్యమంత్రిపై నిప్పులు కురిపించిన ప్రతిపక్ష నాయకుడు అని పెద్ద హెడ్డింగూ, ఆ ప్రక్కనే ఒక కార్టూనూ, నిప్పులు విసిరిన ప్రతిపక్ష నాయకుడూ పళ్ళికిలిస్తూ, అతని ఎదురుగా ముఖం, బట్టలూ నల్లగా కాలిపోయిన మంత్రివర్యులూ. వీడు నిప్పులు కురిపించనూ కురిపించడు, వాడు కాలనూ కాలడు, మధ్యలో తగలబడేది జనమే. ఇంతలో కాఫీ కప్పుతో నా శ్రీమతి వచ్చి "విన్నారా మూర్తి అన్నయ్యగారి అమ్మాయి పెళ్ళి కుదిరిందట, వారం రోజుల్లో ఘనంగా మన ఊళ్ళో ఏ.సి. ఫంక్షన్ హాలులో చేస్తున్నారట" అంటూ వచ్చింది. ఆమె ముఖంలో అసూయ అరవై పాళ్ళు, ఆశ్చర్యం ముప్పై పాళ్ళు, సంతోషం పది పాళ్ళు కనిపించాయి.

నేను కనుబొమ్మలు ఎగరేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు నమోదు చేయించుకోడానికి ఎవరో వీరకృత్యం చేసిన వార్త విన్న వాడిలా ఫీలింగ్స్ పెట్టేను. "అదేంటి మాయగోల మీకేమయిందీ. అలా గుడ్లు మిటకరించారు. మరీ సంతోషం ఎక్కువైతే కష్టం అన్నారు డాక్టరుగారు మాయగోల. అనవసరంగా ఈ వార్త మీకు చెప్పాను, ముందు కాఫీ తాగి కుదుటపడండి" అంది. నేను మామూలు పొజిషన్‌కి వచ్చేసి "మూర్తి అమ్మాయి పెళ్ళి చేస్తున్నాడన్నమాట" అంటూ నా గుండెలు సవరించుకుని పొగలు కక్కే కాఫీ మంచి నీళ్ళలా తాగేశాను.

"అరేయ్ ఇంట్లో వున్నావా" అంటూ మూర్తి ప్రవేశంతో మా ఇద్దరి ఆనందాశ్చర్యాలకు ఫుల్‌స్టాప్ పడింది. మూర్తి చేతిలో నగరంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులు చందనా బ్రదర్స్ వారి సరికొత్త కర్రల బ్యాగ్ ఉంది. అందులోంచి చేటంత సైజ్‌లో ఉన్న శుభలేఖ తీసి నా చేతిలో పెట్టాడు. మెరూన్ కలర్ కార్డుమీద బంగారు రంగు అక్షరాలు ప్రింట్ చేసి వున్నాయి. బాగా పోష్ తరగతివాళ్ళు చేసే పెళ్లిళ్ళకు కూడా శుభలేఖలకు అంత ఖర్చుపెట్టరు. ఆశ్చర్యంతో ఏమిటి సంగతి అన్నట్లుగా ముఖం పెట్టిన నన్ను చూస్తూ...

"మా అమ్మాయి పెళ్ళి ఇంత రిచ్‌గా ఎలా చేస్తున్నాననేగా నీ అనుమానం. నీ చూపులలోనే గ్రహించానులే. ఆ భగవంతుడే నాకు దారి చూపించాడులే" అంటూ శూన్యంలోకి చూస్తూ నమస్కారం పెట్టాడు. నాకు ఎందుకో అనుమానం కలిగింది, ఎక్కడైనా దొంగనోట్లు అచ్చు కొట్టేవాళ్ళని పట్టేడేమో అని భయపడుతూ "ఏరా మూర్తి అమ్మాయి పెళ్ళికోసం అడ్డదారులేమీ తొక్కడం లేదు కదా. బి కేర్‌ఫుల్" అన్నాను. వాడు వెంటనే "డోన్ట్ వర్రీ" అన్నాడు. "మరి ఈ పెళ్ళి ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి" అన్నాను.

"నేను ఏమీ కష్టపడటం లేదు. మన ఊళ్ళో నాకు ఉన్న మంచి పేరు, మిత్రులవలన అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. మరి వస్తాను..." అంటూ మూర్తి హడావిడిగా వెళ్లిపోయాడు. ఇంతలో లోపలనుండి తుపాకీ గుండులా దూసుకువచ్చి, ఆ ఊపులో నా మీద పడబోయి నిలదొక్కుకుని, నా శ్రీమతి ఇంతలేసి కళ్ళు, ముఖం నిండా అసూయ నింపుకుని, అనేక ప్రశ్నల మార్కులు ముఖం నిండా అలంకరించుకుని "ఇదెలాగ" అనుకుంటూ నన్ను చూడసాగింది.

"అవ్వ, అవ్వ దాదాపు నలభై సంవత్సరాలు గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగం వెలగబెట్టి మీరు కూడా ముద్దుల కూతురి పెళ్లి ఇలా చేసి ఏడవలేదు. మాయదారి సంత, ఎప్పుడూ నీతి, నిజాయితీ మంచి పేరు, భగవద్గీతలో కృష్ణభగవానుని శ్లోకాల పారాయణం. చూడండి గుమాస్తా ఉద్యోగం చేస్తున్న అన్నయ్యగారు ఎంత చక్కగా పెళ్లి చేసేస్తున్నారో మీరూ ఉన్నారు ఎందుకూ. అయినా మా నాన్నగార్ని అనాలెండి. నా పెళ్లిచూపులు ఐ.ఎ.ఎస్. పరీక్షలకు వెళ్తున్న, ఇప్పుడు కలక్టర్‌గా పనిచేస్తున్నాయనకు, ఒక వెయ్యి రూపాయలు ఎక్కువ అడిగారని ఆయనతో పెళ్లి చెయ్యలేదు. లేకపోతేనా ఈపాటికి కాలు కింద పెట్టకుండా కార్లలో తిరిగేదాన్ని. నా కూతురికి మూర్తి అన్నయ్యగారి బాబులా ఘనంగా పెళ్లి చేసి ఉండేదాన్ని..." అంటూ ముక్కూ కళ్ళూ కలిపి తుడిచేసుకుంటున్న నా శ్రీమతిని...

"కాసేపు నీ ఫ్లాష్‌బ్యాక్ ఆపి, విషయంలోకి రావాలి. నాకు మూర్తి ఘనంగా చేసే ఈ పెళ్లిలో ఏదో రహస్యం దాగివుందని అనుకుంటున్నాను" అన్నాను.

"చేతగాని వాళ్ళు చెప్పే కబుర్లు ఇవే. మీరు ఎలాగూ చేయలేరు, అలాగని చేసేవాళ్ళని అనుమానించడం, సిగ్గులేకపోతేసరి" అంటూ మూతీ శరీరం అష్టవంకర్లూ తిప్పేసుకుంటూ కోపం అసూయ కలగలిపి ఊగిపోతోంది నా శ్రీమతి. ఎక్కువగా డబ్బు సంపాదించలేని భర్త, తాను కోరిన కోరికలు తీర్చలేని భర్త, తమ ఇబ్బందికర సంసారంలో ఆర్థికంగా పైచేయి సాధించలేక, భర్తపై చిన్నచూపు, కసి పెంచుకుంటారని ఎక్కడో చదివిన గుర్తు. ఇప్పుడు నన్ను నేను ప్రూవ్ చేసుకోవడం, ఆమె కోరినంత డబ్బు సంపాదించడం, ఆమెకు ఇప్పటివరకూ తీరని కోరికలు తీర్చడం అయ్యే పనికాదు. జీవితకాలం లేటయిపోయింది, ఎందుకంటే పదవీ విరమణ చేసిన ఉద్యోగిని కాబట్టి.

పద్దెనిమిది ఇంటూ పన్నెండు అంగుళాల శుభలేఖ, దానిమీద గోల్డెన్ అక్షరాలూ కలిగిన శుభలేఖ పంచారాయె మూర్తి. పెళ్ళి ఏ లెవల్‌లో వుంటుందోనని, శ్రీమతి ప్రముఖ వస్త్ర వ్యాపారులు చందన బ్రదర్స్‌లో వాయిదాల పద్ధతిలో పద్దెనిమిది వేలరూపాయల పట్టుచీర కొనేసింది. పెన్షన్‌లో పద్దెనిమిది వందలు కట్ అవబోతున్నందునకు ఒకవేపు బాధపడుతూ, మరోవేపు నాకు రిటైర్‌మెంట్ రోజున మా ఆఫీసువాళ్ళు ఇచ్చిన కొత్త సఫారీ సూటింగ్ వుండడం వలన, నేను కొనుక్కోనందువలన తప్పిపోయిన అప్పుకు సంతోషపడుతూ వుండగా పెళ్లి తేదీ సూపర్‌ఫాస్ట్‌గా నా దగ్గరికి వచ్చేసింది.

అప్పుడప్పుడు, శుభకార్యాలకు శ్రీమతి ధరించే భారీ నగలు నేను బ్యాంక్‌లోంచి తీసుకురాగా, శ్రీమతి ఆ భారీ నగల అలంకరణతో, పద్దెనిమిది వేల రూపాయల పట్టుచీరతో, దసరా పండుగకు అలంకరించిన గ్రామ దేవతలా తయారైంది. ఆ ప్రక్కనే పాత పట్టుపంచె, భుజంపై కండువా వేసుకున్న పూజారిలాగా నేనూ అణకువగా నడుస్తుంటే, కళ్యాణ మండపం చేరుకున్నాం. నగరంలో ధనికులు చేసే పెళ్లిళ్ళు ఆ ఏ.సి. మండపంలోనే జరుగుతాయి. ఎలక్ట్రికల్ లైటింగ్ డెకరేషన్‌లో కళ్యాణ మండపం, వెన్నెలరేయిలా వుంది.

ఆటో దిగంగానే నా శ్రీమతి ముక్కున వేలేసుకుంది. ఆ వెంటనే నా డొక్కలో మోచేత్తో ఒక్క పోటు పొడిచింది. అమ్మో అనుకుంటూ "ఏమిటే" అన్నాను. ఏదైనా విశేషం వుంటే ఇలా డొక్కలో పొడిచి మాట్లాడడం నా శ్రీమతి యొక్క మాంచి అలవాటు. ఒక్కోసారి ఏదైనా శుభకార్యాలకు ఇద్దరమూ వెళితే, ఇంటికి వచ్చేటప్పటికి, నా పక్కటెముకలు నొప్పితో మూల్గుతుంటాయి. ఇవ్వాళ ఏం రాసిపెట్టి వుందో అనుకున్నాను. మనసులో లాభం, ఒకటి అని లెక్కపెట్టడం మొదలుపెట్టాను. గేటులో అమ్మాయి పేరు, అబ్బాయి పేరు ప్రముఖంగా తాటికాయలంత అక్షరాలతో ట్యూబులైట్లతో అలంకరించి వున్నాయి. ఆపైన రాజకీయ నాయకుల ఎన్నికల పోస్టర్‌లాగా ముప్పై అడుగుల పొడవూ వెడల్పుతో ఆహ్వానపత్రిక లాంటి ఫ్లెక్సీ బోర్డు అలంకరించి వుంది. నా శ్రీమతి నాకు డొక్కలో మరో పోటు బహుకరించింది, బోణీ రెండు అనుకున్నాను.

నాలుగడుగులు వేశామో లేదో, ఫుల్ సూటింగ్స్‌లో వున్న మూర్తి, ఏభై వేల రూపాయల ఖరీదు చేసే పట్టుచీర, వంటినిండా భారీ నగలతో అతని శ్రీమతి మమ్మల్ని స్వాగతించారు. వాళ్ళిద్దరూ అపరిమితానందంగా వున్నారు. నా డొక్కలో మరో పోటు పడింది. "నష్టం మూడు" అనుకున్నాను. మా దగ్గరకు గులాబి రంగు చీర కట్టుకున్న ఇద్దరు అమ్మాయిలు వచ్చి, మేము ఎంతో తెలుసున్నట్లుగా మమ్మల్ని లాక్కెళ్ళి కూల్‌డ్రింక్స్ ఇచ్చేశారు. మరల డొక్కలో మరోపోటు 'అమ్మో నాలుగు' అనుకున్నాను.

షామియానాలు, లోపలి వేపు ముఖమల్ గుడ్డతో అలంకరించి, రంగు రంగుల ముఖమల్ గుడ్డతో చేసిన పూలు కుట్టి వున్నాయి. సర్కస్ డేరాలాగా ఘనంగా వుంది. అది షామియానా లేక సినిమా సెట్టింగా అని నేను సంభ్రమాశ్చర్యాలతో, కళ్ళింత చేసుకుని చూస్తూంటే, నా డొక్కలో ఇంకో పోటు 'వామ్మో ఐదు' అనుకున్నాను.

మేము కళ్యాణ మండపానికి దగ్గరగా వెళ్తున్నాం. ఆ కళ్యాణ మండపం, వెండి బంగారు రంగులో, మెరిసే అద్దాలతో, ముత్యాలతో అలంకరించబడి, సినిమాల్లో దేవకన్యలు సంచరించే మందిరంలా వుంది. అది కళ్యాణ మండపమా లేక స్వర్గం నుండి దిగివచ్చిన ఇంద్రసభలో భాగమా అనిపించింది. నేను పరిశీలించడం పూర్తి కాకుండానే నా డొక్కలో మరో పోటు 'అయ్యో ఆరు' అనుకున్నాను.

"ఆ మధ్యలో అమ్మాయి అబ్బాయి కూర్చుని వున్నారు. అమ్మాయి వెండి బంగారు తీగెలతో తయారైన జరీ చీర కట్టింది. వంటినిండా ఐదారు కేజీల నగలు వున్నాయి. అబ్బాయి పట్టుబట్టలలో మెడనిండా గొలుసులతో చేతులకు బంగారు కడియాలతో మెరిసిపోతున్నాడు. "ఏమిటీ సిరిసంపదలు, అమ్మో మూర్తి చాలా అదృష్టవంతుడే" అని అంటున్నానో లేదో, నా డొక్కలో పోటు పడనే పడింది. "బాబోయ్ ఏడు" అనుకున్నాను ఏడుస్తూ.

బ్యాండ్ మేళాలూ, సన్నాయి వాయిద్యాలు, పాటలు పాడే అమ్మాయిలు, హాలంతా రణగొణ ధ్వనిగా వుంది. బొంబాయి నుండి దిగుమతి అయిన తెలుగు సినిమా హీరోయిన్, తెలుగు మాటలకు డబ్బింగ్‌కి పెదాలు కదుపుతున్నట్లుగా, పురోహితులు పెదాలు కదపటమే కనిపిస్తూంది గాని వారి మంత్రాలు వినపడడంలేదు. పెళ్ళి తంతు పూర్తి అయింది. నెలవారీ స్కీములో సిల్వర్ షాపులో తీసుకున్న చిన్న వెండి కంచం నా శ్రీమతి బహుమతి ఇచ్చింది. మరి హోదాకి తగ్గట్లుగా వుండద్దూ.

"మొత్తానికి మన గౌరవం వెండికంచం లెవల్లో పెరిగించే నీ వల్ల" అన్నానో లేదో నా డొక్కలో ఇంకో పోటు కానుక "ఓ యమ్మో ఎనిమిది" అనేశాను.

ఇంతలో మెరూన్ కలర్ చొక్కాల మీద తెలుపు చారలు వున్న డ్రస్సుల్లో, ఒక పాతిక మంది మగాళ్ళు వచ్చి అతిథులందర్నీ భోజనాలకు లాక్కుపోసాగేరు బలవంతంగా "తలంబ్రాలు చూడాలయ్యా" అంటూంటే "మీకోసం వండించా స్పెషల్స్, మా వంటలు

మీరు రుచి చూడాలి, లేకపోతే చల్లారిపోతాయి" అంటూ మమ్మల్ని రెక్కలు పట్టుకుని లాక్కుపోతుంటే "చూడవే మర్యాదలు ఎలా వున్నాయో" అని నేను అంటూ వుంటే, నా డొక్కలో మరో పోటు గిఫ్ట్ " అమ్మబాబో తొమ్మిది" అనుకున్నా, ఆరు స్వీట్లు, ఆరు హాట్లు, ఆరు రకాల పళ్ళు, ఆరు కూరలు, పచ్చళ్ళు, వడియాలు, అప్పడాలు, రెండు పెరుగు కప్పులు, సాంబార్, రసం వగైరాలు. జానెడు పొట్టకు ఎంత కావాలి, ఏం తినాలో అర్థం కావడంలా. "భోజనం బలే ఉంది" అన్నానో లేదో "మీరూ వున్నారు ఎందుకూ" అంటూ నా డొక్కలో మరో పోటు పొడిచింది. "మై గాడ్ పది" అనుకున్నాను.

ఇంతలో డైనింగ్ టేబుల్ మధ్యలో వున్న పెద్ద స్క్రీన్ మీద "ఈ అపూర్వ వివాహానికి విచ్చేసిన అతిథులందరికీ స్వాగతం, సుస్వాగతం" అంటూ తనకు లేని ముప్పయ్ ఆరు పళ్లు బయట పెట్టి ఒక అమ్మాయి ప్రత్యక్షమైంది. ఆమె ఎటు చూస్తుందో అర్థం కావడంలేదు. ఆమె మెల్లకళ్లవలన.

ఇంతలో ఆ తెరమీద ప్రకటనలు కనపడసాగేయి. "అయ్యా ఒకసారి ఇటు చూడండి. మీరు కూడా మీ అమ్మాయి వివాహం ఇలా గ్రాండ్‌గా చేయాలనుకుంటున్నారా అయితే వినండి..." అంటూ ఒక కోటు వేసుకున్న యువకుడు ప్రత్యక్షమయ్యాడు.

జంబో సైజ్‌లో వివాహ శుభలేఖలకు మెగా కలర్ ప్రింటర్స్‌ని సంప్రదించండి. వారే ఈ శుభలేఖలను బహుకరించారు.

ఈ ఏ.సి.మండపాన్ని ఉదారంగా ఏర్పాటుచేసిన వారు సహృదయ ఈవెంట్స్‌వారు. మీ ఇంట్లో వివాహాలను ఇలాగ ఈవెంట్‌లాగా చేయడానికి వీరిని సంప్రదించండి. హాలీవుడ్ ఎలక్ట్రికల్స్ వారు ఈ వెలుగుల కళ్యాణ మండపాన్ని ఉచితంగా అలంకరించారు. మీ అవసరాలకు వీరిని సంప్రదించండి. ప్రవేశద్వారం వద్ద ఫ్లెక్సీ బోర్డు బహుకరించిన విశ్వ మోహన డిజిటల్స్ వారిని మీ అవసరాలకోసం సంప్రదించండి.

పట్టుచీరలకు, వివాహ వస్త్రాలకు, పెళ్లికుమార్తె నగలకు చుక్కా జ్యూయలర్స్ అండ్ క్లాత్ మర్చంట్స్. ఈ వివాహంలో ఉచితంగా ధరించుటకు నగలు, చీరలు సప్లై చేసినవారు వీరే. మీ అవసరాలకు వీరినే సంప్రదించండి.

షామియానాలు, కళ్యాణ మండపం సప్లై చేసినవారు మిరకిల్స్ సప్లయి కంపెనీ. మీ అవసరాలకు వీరిని అడగండి. మేళతాళాలు, పాటకచేరీలు ఉచితంగా ఏర్పాటుచేసిన వారు అన్నమయ్య ఆర్ట్స్ వీరిని కలవండి మీకు కావాలంటే. చివరగా మీరు భుజించే రుచికరమైన వంటలు, స్వీట్స్ హాట్స్ అందించినవారు అంబికా ఫుడ్స్ అండ్ కేటరింగ్ సర్వీసెస్. వీరికి సగం ధరకే సప్లై చేశారు. కడుపారా ఆరగించి, మీకు కావాల్సినప్పుడు వీరికే ఆర్డర్ ఇవ్వండి.

కళ్ళప్పగించి తెరపై చూస్తున్న నా డొక్కలో ఒక్క పోటు పొడిచింది శ్రీమతి. "అమ్మో అయిపోయాన్రో పదకొండు" అనుకున్నా.

"చాల్లెండి సంబడం. ఇదా సంగతి. దీని కోసం పద్దెనిమిది వేల రూపాయల పట్టుచీర, పదివేలరూపాయల వెండి కంచం, అయ్యో.." అంటూ లేచింది నా శ్రీమతి.

శెలవు తీసుకుందామని మూర్తి దగ్గరకు వెళ్ళాం "వెరీ గుడ్ బాగా చేసేవురా పెళ్ళి" అన్నాను నవ్వుతూ. కాని వాడు పట్టించుకోలేనంత సంతోష సంబరాలలో మునిగి వున్నాడు.

"అతిథులను కూడా వీళ్ళే ఉచితంగా సప్లయి చేస్తారండి, కాని నేనే వద్దన్నాను. ఎందుకంటే నాకు ఈ నగరంలో పరపతి వుంది కదా..." అంటూ నవ్వుతూ ఎవరితోనో చెబుతున్నాడు. అలా చేసి వుంటే ఎంతో బావుండేది. గిఫ్టులకు మాకు ఖర్చు తప్పేది కదా అనుకున్నాను. ఏదిఏమైనా వాడి పరపతి పెరిగిందా లేక తరిగిందా అన్నది వాడే డిసైడ్ చేసుకోవాలి కదా.

"ఏడిచినట్టే వుంది పెళ్లి. అంతా అయిపోయాక ఎవరు తెచ్చినవి వాళ్ళు పట్టుకుపోతే, లాక్కుపోతే కట్టుబట్టలతో నిలబడతాన్నమాట మీ మూర్తి, బలే పెళ్లికి తీసుకువచ్చార్లెండి" అంటూ చివరగా ఒక్క పోటు పొడిచింది. ఇంక వద్దే బాబూ డజనయ్యాయి పోట్లు అన్నాను.

"ఈ ఆఖరి పోటు మిమ్మల్ని అభినందించడానికి పొడిచాను. మన ఇంట్లో జరిగించే నిజమైన, శోభాయమానమైన పెళ్లి. అన్నీ అందరూ దానం చేసే పెళ్లి. ఇది ఒక పెళ్ళేనా" అంది. అమ్మయ్య నా జీవితం మూల్యాంకనం అయింది అనుకున్నాను.

"పదండి నాలుగడుగులు వేద్దాం. తిన్నది అరుగుతుంది. ఈ పెళ్లికి ఆటో కూడా దండగ. పట్టుచీర, వెండి కంచం అప్పు తీరాటంటే, రేపటి నుండి ఇంకా ఎన్ని మానేయాలో..." అంటున్న శ్రీమతితో నడవలేక నడుస్తుంటే "ఏమండీ చిన్నమాట, ఈ చీర చక్కగా మడతపెట్టీ, తిరిగి షాపులో ఇచ్చేసి నచ్చలేదని ఎంతో కొంత ఇమ్మని అడుగుదామా. కనీసం పదివేలు వచ్చినా చాలు" అంటున్న శ్రీమతిని అదోలా చూస్తుంటే డొక్కలో పోటు పడినట్లుగా ఫీలయి ప్రక్కకు వంగిపోతూంటే "నేను పొడవనే లేదుగా సరదాగా అన్నాన్లెండి" అన్నది శ్రీమతి.

ఏమో రేపు ఏం జరుగనుందో, అనుకుంటూ డొక్కలో నెప్పి వస్తుంటే నెమ్మదిగా నడుస్తున్నాను, మూర్తికి ఇచ్చిన ఈ గిఫ్ట్ ఖర్చు రికవరీ అవడానికి రేపటినుండి ఇంకా ఎన్ని బాధలు అనుభవించాలో అనుకుంటూ... ●

**(ఆంధ్రభూమి, డైలీ, 27.02.2010)**